కుండపోత వర్షం


సాగర్‌నగర్ రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు


ఆదర్శనగర్ రహదారిపై నిలిచిన వర్షంనీరు

తగరపువలస: భీమిలి పరిధిలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి రహదారులు జలమయం కాగా డ్రైనేజీలు రోడ్లపైకి పొంగి ప్రవహించాయి. మెయిన్‌రోడ్డు, ప్రయివేట్ మార్కెట్, గ్రంథాలయం రహదారి తదితర ప్రాంతాలు బురదగా మారాయి. జాతీయ రహదారిని ఆనుకుని సబ్బివానిపేట, సంగివలస సర్వీస్‌రోడ్లు, ఆదర్శనగర్, శ్రీబాసర లే అవుట్ ప్రాంతాలలో రోడ్లపై వర్షంనీరు నిలిచి పోయింది. దీంతో నడకమార్గాన రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడ్డారు. చెరువులు నిండిపోగా గోస్తనీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. నవచైతన్య కళానాట్య మండలి 19వ వార్షికోత్సవం సందర్భంగా 300 మంది కళాకారులతో మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రదర్శనలకు వర్షం ఆటంకం కలిగించింది.

తీరంలో భారీ వర్షం

కొమ్మాది: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయమమయ్యాయి. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిరుజల్లులు కురిసినా సాయంత్రం మాత్రం భారీవర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమమయ్యాయి. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ దరి పరదేశిపాలెం గెడ్డ భారీ ఎత్తున వరద నీరు పొంగి పొర్లడంతో 3 రోజుల నుంచి పూర్తి స్థాయిలో రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా బీచ్ రోడ్డు రుషికొండ జంక్షన్, సాగర్‌నగర్, అంధుల పాఠశాల, గుడ్లవానిపాలెం రహదారలపై భారీ ఎత్తున వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా తీర ప్రాంతాలు మంగమారిపేట, ఉప్పాడ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

కుమ్మరించిన వాన

పద్మనాభం: మండలంలో మూడు రోజులుగా ఎడతెరపలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం వర్షం కుమ్మరించింది. ఐదు గంటలకు వర్షం ప్రారంభమైంది. రాత్రి ఏడున్నర గంటల వరకు వర్షం కురిసింది. విలాస్కాన్‌పాలెంలోని మరకమ్మ చెరువు కింద రైతులు వేసిన వరి నారు వర్షపు నీటికి ముంపునకు గురైంది. వరి నారు కనిపించలేదు. వరి నారు మళ్లు చెరువును తలపిస్తున్నాయి. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రెడ్డిపల్లి ఎస్సీకాలనీ సమీపంలో కోమటి గుండం చెరువుకు వెళ్లే గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. విజయనగరం-శొంఠ్యాం ఆర్అండ్‌బీ రోడ్డు జలమయమైంది.


ఉధృతంగా ప్రవహిస్తున్న గోస్తనీనది


సబ్బివానిపేట వద్ద సర్వీస్ రోడ్డుపై నిలిచిన నీరు


శ్రీబాసర లే అవుట్‌లో నిలిచిన వర్షంనీరు


రెడ్డిపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న కోమటి గుండం గెడ్డ


విలాస్కాన్‌పాలెంలో నీట మునగిన వరి నారు

జడివానలో గడప గడపకు...


వాంబేకాలనీలో వర్షంలో తడుస్తూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

వాంబేకాలనీలో ఎమ్మెల్యే ముత్తంశెట్టికి ఘన స్వాగతం

మధురవాడ: జడివానను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో ఈ సందర్భంగా ఆయన అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లగా.. మహిళలు ఆత్మీయంగా హారతలతో స్వాగతం పలికారు. వారి యోగా క్షేమాలు, సమస్యలు తెలసుకుంటూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలును ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ పేదలు బాగుండాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలన్నారు. చంద్రబాబు పాలన అంతా హామీలతో సాగిందని, వైఎస్సార్‌సీపీ హయాంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలతో పాటు అనేక పథకాలు ప్రవేశపెట్టి పేదలకు చేరువయ్యారన్నారు. వాంబేకాలనీలో అనేక సంక్షమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఈ బ్లాక్‌లో చేతి పంపు నిర్మాణం, మరో బోరు మరమ్మతులు, ఇతర బ్లాకుల్లో డ్రైనేజీ వ్యవస్థ మరమ్మతులు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తంశెట్టి మహేశ్, జీవీఎంసీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, విశాఖ రూరల్ తహసీల్దారు సనపల రమణయ్య, ఆర్ఐ మల్లేశ్వరరావు, పలువురు అధికారులు, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, సచివాలయాలు ఇన్‌చార్జ్, గృహసారథులు రామిరెడ్డి, రాజు, ఎల్లాజీ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, ముదుండి రాజేశ్వరి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, వివిధ విభాగాలు అధ్యక్ష, కార్యదర్శులు చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, పిల్లా సూరిబాబు, జగ్గుపిల్లి నరేష్, ఎమ్‌వీ రమణమూర్తి, డాక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ముత్తంశెట్టి

క్లుప్తంగా

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం రూ.3.68 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీహరి సేవాసమితి సభ్యులు

తగరపువలస : సంగివలస కొత్తమ్మతల్లి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.3,68,157 ఆదాయం లభించినట్టు ఈవో బి.ప్రసాద్ తెలిపారు. జూన్ 12 నుంచి మంగళవారం వరకు 44 రోజులకు సంబంధించి ఈ ఆదాయం లభించిందన్నారు. ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.ప్రసన్నలక్ష్మి, ఆలయ సిబ్బంది కోరాడ శ్రీను, అర్చకుడు ఏడిద రామకృష్ణశర్మ పాల్గొనగా హుండీ ఆదాయాన్ని నగరానికి చెందిన శ్రీహరి సేవా సమితి సభ్యులు లెక్కించారు.

ప్రభుత్వ భూములు రక్షించాలని వినతి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలసలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతూ మాజీ సర్పంచ్ బోని వెంకటరమణ, భీమిలి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సర్వే నంబర్ 2, 180/1, 180/2లలో సుమారు 12 ఎకరాలు పోరంబోకు, బంజరు భూములు ఉన్నాయని వాటిని బయట వ్యక్తులు ఆక్రమించుకుని విక్రయించడం, ఇళ్లు కట్టుకోవడం జరుగుతుందన్నారు. దీనిపై దృష్టి సారించాలని తహసీల్దార్‌ను కోరినట్టు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో బోని పైడితల్లి, మట్టా ఆదినారాయణ, బోని రాంబాబు, మామిడి భాస్కరరావు ఉన్నారు.

వందమందికి వైద్య సేవలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొమ్మాది : జీవీఎంసీ 6వ వార్డు కె2 కాలనీలో రోటరీ క్లబ్, వైజాగ్ డైమండ్స్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు డా. కేవీ రాజారమేష్, మౌనిక, రోటరీ క్లబ్ అధ్యక్షులు శశి జైస్వాల్, సీఐటీయూ నాయకులు పి. రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ సర్వే


చంద్రంపాలెంలో సర్వే చేస్తున్న బీఎల్‌వోలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: ఇంటింటా ఓటర్ సర్వే చురుగ్గా సాగుతోంది. బూత్ లెవెల్ ఆఫీసర్స్, ఇతర సిబ్బంది సర్వే చేపడుతున్నారు. మంగళవారం చంద్రంపాలెంలో బీఎల్‌వో పావని ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వివిధ విభాగాలు నాయకులు పిళ్లా సూరిబాబు, పోతిన పైడిరాజు తదితరులు పాల్గొన్నారు. కొత్త ఓటర్ల నమోదును పరిశీలించారు.

మురుగు వెళ్లకుండా చర్యలు

మధురవాడ: మధురవాడ జోన్‌లోని ఇంటర్ నేషనల్ క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న చాణక్యపురి 1, 2 ఎప్రూవ్ లే అవుట్‌లలో ప్రైవేటు ఇంటి స్థలాల్లోకి మురుగునీరు వెళ్లకుండా చర్యలు చేపడతామని జోనల్ కమిషనర్ కె. కనక మహాలక్ష్మి చెప్పారు. తమ ఇంటి స్థలాల్లోకి మురుగునీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని గత కొద్ది కాలంగా సీహెచ్. లక్ష్మి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు స్పందనలో ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు సదరు స్థలాలను, లే అవుట్‌ను జీవీఎంసీ జోన్-2 టీపీవో వరప్రసాద్, సర్వేయర్ సత్యనారాయణలు పరిశీలించారు.

అర్హత కలిగిన రైతులకు పాస్ పుస్తకాలు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ సర్వే నంబర్ 189, 145/2, 157లో సాగులో ఉన్న, సంబంధిత పత్రాలు కలిగిన రైతులకు అర్హతను బట్టి పాస్‌పుస్తకాలు జారీ చేస్తామని భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. చెంచలి కామేశ్వరి తదితరులకు ఖాతా నంబర్ 1273తో జారీ చేసిన పాస్‌పుస్తకాలు రద్దు చేయాలని కోరుతూ ఇక్కడ అనుభవంలో ఉన్న రైతులు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామసభకు హాజరు కావాలని తహసీల్దార్ వేణుగోపాల్ చెంచలి కుటుంబీలకు నోటీసు జారీ చేశారు. వారు నోటీసులు తీసుకోకపోవడంతో వాట్సాప్ ద్వారా పంపించి సచివాయంలో కూడా నోటీసులు అంటించామన్నారు. ఈ విషయం తెలుసుకుని వందలాది మంది రైతులు గ్రామ సచివాలయం వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు వేచి చూసినా చెంచలి కుటుంబీకులు గ్రామ సభకు హాజరుకాలేదు. దీనిపై రైతులు మాట్లాడుతూ అర్హత కలిగిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ పంచాయతీ తీర్మానం, వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, వైస్ సర్పంచ్ కొయ్య శ్రీనివాసరెడ్డి, మద్దిల వెంకటరమణ, ఉండబట్ల చిన్నారావు, గాడు తాతినాయుడు, మద్దిల గురునాయుడు, కొయ్య కృష్ణారెడ్డి, సింగిడి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న భీమిలి తహసీల్దార్ వేణుగోపాల్

ఓటర్ జాబితాల్లో లోపాలు సవరిస్తాం

భీమిలి: ఓటర్ జాబితాలలో లోపాలు సవరించడమే కాకుండా ఒకే కుటుంబానికి ఉన్న ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌లో వచ్చేలా చర్యలు తీసుకుంటామని భీమిలి ఆర్డీవో పి.భాస్కరరెడ్డి తెలిపారు. మంగళవారం భీమిలిలోని ఆయన కార్యాయలంలో వైఎస్సార్ సీపీ, బీజేపీ, టీడీపీ, జనసేన నేతలతో సమావేశమయ్యారు. డోర్ టు డోర్ వెరిఫికేషన్ జరుగుతున్న తీరుపై చర్చించారు. దీనిపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. గత నెల 24 నుంచి ఈ నెల 22 వరకు జరిగిన సవరణలు గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, నాయకులు పాల్గొన్నారు.


వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఆర్డీవో భాస్కరరెడ్డి

విజ్ఞాన శాస్త్రంతో మానవ వికాసం

కొమ్మాది: విజ్ఞాన శాస్త్రం అభివృద్ధితోనే మానవ వికాసం సాధ్యమవుతుందని కృష్ణా కళాశాల అధ్యాపకురాలు రూపావాణి అన్నారు. మంగళవారం కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన విజ్ఞాన జ్యోతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి జీవితంలో ఎన్నో అద్భుత ఆవిష్కరణలు చేసిన ఘనత విజ్ఞాన శాస్త్రానికి దక్కుతుందని, సాగరం నుంచి అంతరిక్షం వరకు మనిషి పయనంలో దీని ప్రాముఖ్యత ఘనణీయమైందన్నారు. నిత్య జీవితంలో విజ్ఞాన శాస్త్ర ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విజ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా బాలికలకు ఇంజినీరింగ్, వైద్య విద్య, పోటీ పరీక్షలకు పుస్తకాలు, ఆన్‌లైన్ తరగతులు వంటి సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందని వీటిని ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎంవీ ఎస్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రూపావాణి

హుద్‌హుద్ ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించాలి

ఎంవీపీ కాలనీ: హుద్‌హుద్ ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతూ ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా కార్యాలయం ఎదుట మంగళవారం ఉదయం ఆయా నివాసితులు నిరసనకు దిగారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.వెంకటరావు మాట్లాడుతూ గతంలో హుద్‌హుద్ తుపాను కారణంగా నష్టపోయిన వారికి కొమ్మాదిలో హౌసింగ్ కార్పొరేషన్ ఇల్లు కేటాయించిందన్నారు. అయితే ఆ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. దీనిపై కొంత కాలంగా లబ్ధిదారులు హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరా లేని కారణంగా ఆయా ఇళ్లలో అంధకారంతో పాటు నీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై కార్పొరేషన్ పీడీ స్పందిస్తూ త్వరలోనే విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని హామీ ఇచ్చినట్లు వెంకటరావు తెలిపారు.


హౌసింగ్ కార్పొరేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న హుద్‌హుద్ ఇళ్ల నివాసితులు

స్కూల్ కాంప్లెక్సులతో మెరుగైన బోధన

పద్మనాభం: స్కూల్ కాంప్లెక్సు సమావేశాల వల్ల ఉపాధ్యాయులు తమ బోధన పటిమను పెంపెందించుకోవచ్చని పద్మనాభం స్కూల్ కాంప్లెక్సు హెచ్ఎం ఎ.బాలామణి అన్నారు. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్సులో అనంతవరం, రెడ్డిపల్లి, పద్మనాభం పాఠశాలల స్కూల్ కాంప్లెక్సుల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్సులో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేయాలన్నారు.

నీటి తరలింపు పనులు ప్రారంభం


చంద్రంపాలెం హైస్కూలు గ్రౌండ్‌లో నీటి తరలింపు పనులు చేపడుతున్న దృశ్యం

మధురవాడ: వర్షం పడితే చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నీరు నిలిచి పోతోంది. దీంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రూ.5లక్షలతో లోతట్టు ప్రదేశంలో గుంతలు పూడ్చివేత..అండర్ గ్రౌండ్ పైప్‌లైన్‌లు ఏర్పాటు మైదానంలో నీటిని బయటకు పంపే పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా లోతట్టు ప్రాంతంలో మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేసేందుకు గొతులు తవ్వి రక్షణ చర్యలు చేపడుతున్నారు. అలాగే బాగా లోతు ఎక్కువ ఉన్న ప్రాంతంలో ఫిల్లింగ్ చేసే పనులు కూడా చేపడుతున్నట్టు ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు చెప్పారు.

కార్మిక నాయకుడు పైడయ్యరెడ్డి మృతి



తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం మాజీ వైస్ ప్రెసిడెంట్ జీరు పైడయ్యరెడ్డి (97) అస్వస్థతతో మంగళవారం చిల్లపేటలోని ఆయన ఇంటి వద్ద మృతి చెందారు. మిల్లులో కార్మికుల సమస్యలపై పోరాడటమే కాకుండా గ్రామ పెద్దగా స్థానిక సమస్యల పరిష్కారంలో పైడయ్యరెడ్డి ముందుండేవారు. ఈయన మృతిపై కాంగ్రెస్ కార్మిక సంఘం, వైఎస్సార్‌సీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

వరి నారుకు తెగుళ్లు

ఆనందపురం : మండలంలోని బోనిలో రైతులు వేసిన వరి నారుమడులను అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్ర వేత్తలు మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు రైతులకు పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు ఎం.విశాలాక్షి, ఎ.శిరీషాలు పొలంలో పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. నారు మడులను పరిశీలించిన వారు వరి నారుకు ఆకు ఎండి తెగులు సోకినట్టు గమనించారు. దాని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు 10 లీటర్ల నీటిలోను, స్ట్రెప్టో సైక్లిన్ మందు ఒక గ్రాము 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం దమ్ము మడులను ఎలా సిద్ధం చేసుకోవాలో రైతులకు వివరించారు. వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సీహెచ్ సుబ్రహ్మణ్యం, భీమిలి డివిజన్ ఏడీఏ బి.విజయ్ భాస్కర్, వ్యవసాయాధికారి సంధ్య రత్న ప్రభ పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ

తగరపువలస: ఇటీవల భర్త మరణించి కుటుంబ పెద్ద దిక్కు కోల్పోయిన సమ్మిడి సూర్యకళ కుటుంబానికి మంగళవారం తగరపువలసకు చెందిన వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీలో జరిగిన ఈ కార్యక్రమంలో వీటిని మాజీ సైనికుడు నీలాపు శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దాతలు నెలనెల అందించే చిరు సాయం రూ.50లతో నిరుపేద కుటుంబాలకు ప్రతినెలా బియ్యం ప్యాకెట్, నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

కొమ్మాది: ఉత్తర, మధ్య బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రభావంతో ఉత్తర కోస్తా తీరంలో తీవ్ర గాలులు, అలల ఉధృతి ఎక్కువగా ఉంటుందన్న తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులంతా అప్రమత్తంగా ఉండాలని భీమిలి మత్స్యశాఖ అధికారిని డి. లావణ్య తెలిపారు. ఈ నెల 29 వరకు ఈ అల్పపీడనం కొనసాగుతుందని, తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు.

పల్లెల వికాసమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: ప్రతి గ్రామాన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రగతి పథంలో నడిపించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోరాడ, బి.ఆర్.తాళ్లవలస గ్రామాల్లో మంగళవారం సాయంత్రం జగనన్న సురక్ష గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో పథకాల కోసం ప్రజలు నాయకులు, అధికారులు చుట్టూ తిరిగేవారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రజల వద్దకే అధికారులను పంపించి పథకాలు అందజేసి సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు తమ మద్దతు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా కోరాడలో 285 మందికి, బి.ఆర్.తాళ్లవలసలో 92 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. గెద్దపేట గ్రామానికి చెందిన మృతుడు దాసరి తాడు వైస్సార్ బీమా కింద రూ.5లక్షలు మంజూరు కాగా వీటిలో తక్షణ సాయంగా రూ.10వేలు ఎమ్మెల్యే అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, బి.తాళ్లవలస సర్పంచ్ చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ టి.శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకులు కోండ్రోతు శ్రీనివాసరావు, మామిడి శివరామ కృష్ణ, సిరుగుడి ఆదినారాయణ, సుంకర బంగారప్పడు, బుగత సత్యనారాయణ, ఈర్ల ఈశ్వరరావు, బోని సన్యాసినాయుడు పాల్గొన్నారు.


దాసరి తాడు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కమ్యూనిటీ టాయిలెట్ల వద్ద కేర్ టేకర్లు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో కమ్యూనిటీ టాయిలెట్ల వద్ద కేర్ టేకర్లను నియమించినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మినాయుడు తెలిపారు. ఇప్పటి వరకు శివారు కమ్యూనిటీ టాయిలెట్ల వద్ద కేర్ టేకర్లు లేని కారణంగా శుభ్రపరచే వారు లేక నిరుపయోగంగా ఉండేవి. ప్రస్తుతం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో భాగంగా వినియోగంలో లేని కమ్యూనిటీ టాయిలెట్లను పే అండ్ యూజ్ పద్ధతిలో కేర్ టేకర్ల నియామకంతో పాటు మరమ్మతులు, విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారు. జోన్‌లో బహిరంగ మల విసర్జనకు స్వస్తి పలికి కమ్యూనిటీ టాయిలెట్లను వినియోగించుకుంటూ స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ప్రజలంతా సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు కోరారు.

ఫుట్ ఓవర్ వంతెన నిర్మించాలి

మధురవాడ: జాతీయ రహదారిపై చంద్రంపాలెం హైస్కూలు వద్ద ప్రజలు, విద్యార్థుల రక్షణార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాతపూడి ప్రదీప్ కుమార్ కోరారు. మంగళవారం ఆయన నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ చింతాడ సతీష్‌కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో 4 వేల మంది విద్యార్థులున్నారని, సమీప ప్రాంత ప్రజలు వేలాది మంది వివిధ పనుల నేపథ్యంలో రోడ్డు దాటాల్సి ఉంటుందన్నారు. రోడ్డు దాటే క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజా రక్షణార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరారు. ఇప్పటికే ఈ విషయాన్ని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

సత్యసాయి సంస్థల సేవలు ప్రశంసనీయం

ఆనందపురం : మారుమూల గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న సత్యసాయి సేవా సంస్థల సేవలు ఆదర్శనీయమని కుసులువాడ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి అన్నారు. సత్యసాయి సేవా సంస్థలు జిల్లా జోన్ ఆధ్వర్యంలో విశాఖ కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో కూడా సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పలువురికి ఉచితంగా మందులు అందజేశారు.


రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు